# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# కేంద్ర కమిటీ

## విప్లవ ఐక్య సంఘటన సహాయ కార్యదర్శి ప్రొఫెసర్ సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన విడుదల కోసం ఉద్యమించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## ప్రెస్ విజ్ఞప్తి

మహారాష్ట్ర పోలీసులు విప్లవోద్యమాన్ని తుదముట్టించడానికి గత 35 సంవత్సరాలుగా హద్దులెరుగని నేరాలు చేస్తున్నారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లలో డజన్‌ల కొద్ది విప్లవకారులను అంతమొందించారు. టాడా, పోటా, మాకోకా లాంటి భయంకరమైన నల్లచట్టాల కింద వేలాది రైతాంగాన్ని అరెస్టు చేసి, చిత్రహింసల పాలు చేసి జైళ్లపాలు చేయడం వారికి ఒక వినోదక్రీడగా మారింది. పోలీసు లాకప్పులలో, జైళ్లలో సైతం విప్లవకారులను తుదముట్టించడం వారికి వెన్నతో పెట్టిన విద్యే. ఇక మహిళలపై అత్యాచారాలకు మహారాష్ట్ర, దేశ రాజధాని ఢిల్లీతో పోటీపడుతోంది. రాష్ట్రంలోని విదర్భ ప్రాంతంలో విప్లవోద్యమాన్ని నిర్మిస్తున్న మా పార్టీ కార్యకర్తలను, రైతాంగాన్ని, శ్రామికులను, విద్యార్థులను, మేధావులను, కళాకారులను, రచయితలను వేధించడం, హింసించడం, మహిళలను అత్యాచారాలకు గురిచేయడం ఏయేటికాయేడు తీవ్రమవుతూంది. 2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మొదలయ్యాక పోలీసుల ఘాతుకాలు మరింత పెచ్చరిల్లాయి. వీరి ఘాతుకాలు మహారాష్ట్రకే పరిమితం కాలేదు. రాష్ట్ర సరిహద్దులు దాటి ఎక్కడైనా, ఎవరినైనా ఏమైనా చేయడంలో ఖాకీలు దిట్టలు. పైగా వారు చేసే ప్రతి హీనమైన, దాష్టీకమైన చర్యకు సాధికారతను కల్పించుకోవడానికి చిలువలకు పలువలల్లుతూ బూటకపు ప్రచారాన్ని చేపట్టడంలో వారికి వారే సాటి. గడ్‌చిరోలి జిల్లాను మావోయిస్టురహిత జిల్లాగా ప్రకటించడానికి వాళ్లెంతో ఉవ్విళ్లూరుతున్నారు. ఇందులో భాగంగానే మే 9 నాడు ఢిల్లీలో ఢిల్లీ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్, విప్లవ మేధావి, విప్లవ ఐక్య సంఘటన (ఆర్‌డిఎఫ్) సహాయ కార్యదర్శి అయిన ప్రొఫెసర్ సాయిబాబాను మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడాన్ని మా పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. ఆయన విడుదలకు బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా దేశ, విదేశ ప్రజలకు ముఖ్యంగా ప్రజాస్వామికవాదులకు, మేధావులకు, రచయితలకు, న్యాయవాదులకు, పాత్రికేయులకు, కళాకారులకు, ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తోంది.

మహారాష్ట్రలోని గడ్‌చిరోలి విప్లవోద్యమానికి రాష్ట్ర రాజధాని ముంబాయి, దేశ రాజధాని ఢిల్లీకి లంకె కలపడం మహారాష్ట్ర పోలీసులకు కొత్తేమీ కాదు. కాకపోతే విప్లవోద్యమాభివృద్ధితో పాటు పోలీసుల దుశ్చర్యలు తీవ్రమయ్యాయి. ఇందులో భాగంగానే ప్రస్థుత విద్యార్థుల, మేధావుల అరెస్టుల పర్వానికి గత సంవత్సరం తెర లేపారు. శారీరకంగా అంగవికలుడైన ఢిల్లీ జెఎన్‌యు విద్యార్థి హేమ్ మిశ్రా గడ్‌చిరోలి జిల్లాలో డా. బాబా ఆమ్టె స్థాపించిన పేరొందిన 'లోక్‌బిరాదరి' ఆసుపత్రికి వెళ్తుండగా మార్గమధ్యంలో జిల్లా పోలీసులు అరెస్టు చేసి మావోయిస్టు ముద్రవేసి మాడ్‌కొండల్లో నాయకత్వాన్ని కలవడానికి వెళ్తున్నట్టుగా కట్టు కథలల్లారు. తర్వాత కొద్ది రోజులకు ఛత్తీస్‌గడ్ రాజధాని రాయపూర్‌లో ఢిల్లీ మేధావీ, రాజకీయ ఖైదీల విడుదల ఉద్యమ కార్యకర్త ప్రశాంత్ రాహిని అరెస్టు చేసి అచ్చంగా పై కట్టుకథనే మళ్లీ ముందుకు తెచ్చారు. వీరిద్దరి అరెస్టు తర్వాత అసలు నాటకాన్ని మొదలు పెట్టారు. వారి దగ్గర తగిన ఆధారాలు దొరికాయని మురిసిపోతూ తమ లక్షిత దాడులకు ఢిల్లీని కేంద్రం చేసుకున్నారు. ఢిల్లీలో ప్రొఫెసర్ సాయిబాబా ఇంటిపై దాడులు చేయడం, విచారణ పేరుతో చిత్తం వచ్చినట్లు వ్యవహరించడం ఆయన ఇంట్లోని కంప్యూటర్, హార్డ్ డిస్క్‌లు తస్కరించడం లాంటి చర్యలకు పలుసార్లు పాల్పడి తుదకు ఆయనను మే 9 నాడు అరెస్టు చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో శవాలుగా మారిన వ్యక్తుల వద్ద ఎకెలు, ఎస్ఎల్‌ఆర్ లాంటి ఆయుధాలనే సృష్టించగల ఖాకీ నిపుణులు హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీల వద్ద మైక్రో చిప్‌లను పుట్టించడంలో ఆశ్చర్యమేముంది? దారిన పోయే ఏ దానయ్యనైనా దొరకబుచ్చుకొని కేసుల్లో ఇరికించగల పోలీసులు ఆ ఇద్దరి వెంటా ఇద్దరు ఆదివాసీ రైతులను జత చేయడంలో వింతేముంది? నిజానికి తమ అరెస్టు నాటకం వెనుక గల పోలీసు కుట్రలను వెల్లడిస్తూ ఈ మధ్యనే కామ్రేడ్ ప్రశాంత్ రాహి జైలు నుంచి విడుదల చేసిన విజ్ఞప్తి (మీడియా ద్వారా)ని చదివిన వారికెవరికైనా అసలు వాస్తవాలు సులువుగానే బోధపడుతాయి. ప్రస్తుతం వీరందరిపై భయంకరమైన యుఎపిఎను మోపారు. కా. సాయిబాబాను 14 రోజుల పోలీసుల రిమాండ్‌కు ఇవ్వడం కోర్టుల సంవేదనా రాహిత్యానికి పెద్ద ఉదాహరణ. మరో తోడు లేకుండా వీల్‌చైర్ పైనే కదిలే వ్యక్తిని 14 రోజుల పిసిఆర్‌కు ఇవ్వడమంటే కోర్టులు ఎవరి ఆదేశాలపైన నడుచుకుంటున్నాయో గమనించవచ్చు.

దేశంలో గత నాలుగున్నర దశాబ్దాలుగా నిర్మితమవుతున్న విప్లవోద్యమానికి దేశంలోని విప్లవ మేధావులు అండగా నిలిచారు. తమ పరిధిలో వారు దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్నారు. వారు సంఘటితంగానూ, చట్టబద్ధంగానే పోరాడుతున్నారు. వారి సంఘాలు చట్టబద్ధంగానే పని చేస్తున్నాయి. వాటిలో విప్లవ ఐక్య సంఘటన (ఆర్‌డిఎఫ్) ఒకటి. దేశంలో నిర్మితమవుతున్న విప్లవోద్యమాన్ని ఆర్‌డిఎఫ్ దృఢంగా సమర్థిస్తోంది. ఫలితంగా రాజ్యం దానిపై కత్తి కట్టింది. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రజలపై యుద్ధంగా స్పష్టం చేసిన వందలాది ప్రగతిశీల, విప్లవ ప్రజాసంఘాలలో ఆర్‌డిఎఫ్ ఒకటి. అందుకే ఆర్‌డిఎఫ్ నాయకత్వాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

సహించలేకపోతున్నాయి. ఆర్‌డిఎఫ్ నాయకత్వాన్ని అరెస్టులు చేయడం, తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుపాలు చేయడం ఏనాటికానాడు తీవ్రమవుతోంది. వారిలో ప్రొఫెసర్ సాయిబాబా ఒకరు. ఝార్ఖండ్ పోలీసులు ఆర్‌డిఎఫ్ నాయకులలో ఒకరైన జీతన్ మరాండీని అరెస్టు చేసి ఆరోపించిన తప్పుడు కేసుల్లో కోర్టు ఆయనకు మృత్యుదండన విధించడం జగమెరిగిందే. ఆ తీర్పురు ఖండిస్తూ దేశంలో నిర్మితమైన ప్రజా ఉద్యమ ఫలితంగా తుదకు మృత్యుదండనపై కోర్టులో రద్దవడం గమనార్హం. ఈ మధ్యే ఉత్తరాఖండ్‌లో ఆర్‌డిఎఫ్ నాయకున్ని అరెస్టు చేశారు. కొద్ది మాసాల క్రితం బీహార్‌లో ఆర్‌డిఎఫ్ నాయకులు రాజకిషోర్‌సింగ్‌ను అరెస్టు చేశారు. ఒడిశాలో దండపాణి మహంతిని 2013 ప్రారంభంలో అరెస్టు చేశారు. ఇలాంటి చర్యలలో ఆంధ్ర పోలీసులు అందరికన్నా ముందున్నారు. వారు ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరం క్రితమే ఆర్‌డిఎఫ్‌ను నిషేధించారు. అంతేకాదు, ఖాకీ గూండాలు ఆర్‌డిఎఫ్ నాయకుడైన గంటి ప్రసాదంను నెల్లూరు పట్టణంలో పట్టపగలు బహిరంగంగా హత్యచేశారు. ఇంతటి హీన చరిత్ర కలిగిన కుఖ్యాత ఖాకీలు ప్రొఫెసర్ సాయిబాబాపై పోలీసులపై మాటుదాడులను, రెయిడ్‌లను, దొమ్మీ కేసులను మోపగలరు. ఆయన అవిటివాడైనా ఎన్నైనా కేసుల్లో నిందితుడు కాగలడు. దేశ, విదేశాల విప్లవోద్యమాల చరిత్రలను పరిశీలిస్తే ఖాకీల ఇలాంటి చర్యలు ఎవరికీ వింతనిపించవు. నిర్దోషులైన మేధావులను ప్రజా ఉద్యమాల ద్వారానే కాపాడుకోగలమని మా పార్టీ దృఢంగా భావిస్తోంది. అందుకు మీరంతా పూనుకోవాలనీ మరోసారి విజ్ఞప్తి చేస్తోంది.

గత సంవత్సరకాలంగా డిఐజి రవీంద్ర కదం, గడ్‌చిరోలి ఎస్‌పి సువేజ్ హక్‌లు చేయని నేరమంటూలేదు. గోవిందగాం, భట్‌పార్, సిందేసూర్, మెడ్రి, భగవాన్‌పూర్‌లలో అనేకమంది విప్లవకారులను, ఆదివాసీ రైతులను హత్య చేశారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో బేత్‌కాటిలో 7గురు మా గెరిల్లాలను విషప్రయోగం ద్వారా ఎలా హత్య గావించారో స్వయాన వారి ఏజంటు పప్పు గుప్తానే మీడియా ముందు స్పష్టం చేశాడు. ఇదే ఫిబ్రవరిలో గడ్‌చిరోలి పోలీసులు పొరుగున ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గర్తుల్ గ్రామంపై సమాచారంతో దాడి చేసి ముగ్గురు విప్లవకారులను పొట్టన పెట్టుకున్నారు. మరోవైపు సుధీర్ ధవళే లాంటి కళాకారులను కటకటాల్లోకి తోశారు. ఆర్‌డిఎఫ్ బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. ఎన్నికల ఫలితాలు వెలువడడానికి సరిగ్గా వారం రోజుల ముందు సాయిబాబాను అరెస్టు చేయడం యాదృశ్చికం ఏమీ కాదు. ఎన్నికల అనంతరం ఏర్పడబోయే ప్రభుత్వ ఫాసిస్టు విధానాలకు ఈ అరెస్టు ఒక ఉదాహరణగా నిలుస్తుంది. ఇప్పుడు ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేశారు. ఇలాంటి అరెస్టులను, నిషేధాలనూ ఖండిస్తూ విప్లవ ప్రజలకు, విప్లవ ఐక్య సంఘటన లాంటి అన్ని విప్లవ ప్రజాసంఘాలకు అండగా నిలవాల్సిందిగా ప్రొఫెసర్ సాయిబాబా విడుదలకు ఉద్యమించాల్సిందిగా మా పార్టీ కోరుతోంది.

- **ప్రొఫెసర్ సాయి బాబాను తక్షణం విడుదల చేయాలి. హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీతో పాటు ఆదివాసీ రైతులను వెంటనే విడుదల చేయాలి.**
- **ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలి, ఓడించాలి.**
- **ప్రజల పోరాట హక్కుల కోసం, రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాడాలి.**
- **ఆంధ్ర ప్రదేశ్‌లో ఆర్‌డిఎఫ్‌పై నిషేధం ఎత్తివేతకై పోరాడండి.**

**విప్లవాభినందనలతో**

**అభయ్**

తేదీ: 13 మే 2014

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**